మూగ జీవాల లెక్క తీస్తున్నారు



మాదలలో పశుగణన సర్వేను పరిశీలిస్తున్న మండల పశువైద్యాధికారి పుల్లారెడ్డి

- ఐదేళ్ల కోసారి పశుగణన సర్వే
- గ్రామాల్లో సాగుతున్న ప్రక్రియ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు..

ముప్పాళ్ళ: గ్రామాల్లో మూగ జీవాల లెక్కలు పక్కాగా ఉండేందుకు గాను పశు సంవర్ధక శాఖ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని చేపట్టింది. ఏ ఇంట్లో ఎన్ని రకాల మూగ జీవాలు ఉన్నాయి, గతం లో కంటే పాడి పరిశ్రమ ఎక్కువగా ఉందా అనే అంశాలను తెలుసుకునేందుకు సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఈ ప్రక్రియ గతంలో 2018లో ప్రారంభమై 2019లో ముగిసింది. మరలా 2024లో ప్రారంభించారు. 2025లో ముగియనుంది. సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని ముప్పాళ్ళ, సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి మండలాల పరిధిలో మూడు యూనిట్‌ల పరిధిలో గల ఆవులు, గేదెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్లు, ఇతర పక్షులను లెక్కిస్తారు. సబ్ డివిజన్ పరిధిలో ఆవులు 3,711,గేదెలు 27,212, గొర్రెలు 17,814, మేకలు 5,282, పందులు 20,కుక్కలు 500, కోళ్ల 18,449 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.



పశుగణన ప్రక్రియ జరుగుతోంది

మూగజీవాల లెక్కింపు ప్రతి ఐదేళ్లకోసారి జరుగుతుంది. నవంబర్ 1వ తేదీన ప్రారంభమైంది. ఇప్పటికి పట్టణ ప్రాంతంలో 12, గ్రామీణ ప్రాంతాల్లో 17 శాతం సర్వే పూర్తయింది. ఇటీవలే ప్రారంభం కావడంతో నిదానంగా జరుగుతోంది. ప్రస్తుతం ఎన్ని జంతువులు ఉన్నాయి, పాడి పరిశ్రమ ఎలా ఉంది, కోళ్ల ఉత్పత్తి తదితర వివరాలు తెలుస్తాయన్నారు.

–ఎం.పుల్లారెడ్డి, ఇన్‌చార్జ్ మండల పశువైద్యాధికారి, ముప్పాళ్ల

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ కొలిమి షమ్మి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ ఇన్నారావు

సత్తెనపల్లి: ఆరోగ్యం పట్ల పిల్లలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలోని 16వ వార్డ్ ఎంపీపీ పాఠశాలలో శనివారం నిర్వహించిన రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ షమ్మి మాట్లాడుతూ పట్టణంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల చిన్న పిల్లల ఎత్తు, బరువు, పోషణ, కంటిచూపు, వినికిడి, రక్తహీనత, పలు వైద్య పరీక్షలు నిర్వహించి వాటికనుగుణంగా వైద్యం అందించాలన్నారు. వైద్యాధికారులు ధర్మ సింఫ్ శాస్త్రి, డాక్టర్ ఎండీ ఆసియా, హెల్త్ సూపర్‌వైజర్ మంజుల మార్గరేట్, ఏఎన్ఎం అంజనీదేవి, ఆశ వర్కర్ మైనిక ఉన్నారు.

చికిత్స ద్వారా లోపాలను సవరించాలి

అచ్చంపేట: పుట్టుకతో వచ్చే జన్యులోపాలకు సరైన సమయంలో చికిత్స అందిస్తే.. సవరించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.ఇన్నారావు అన్నారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమాన్ని స్థానిక ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో శనివారం ఎంపీడీవో కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని పీహెచ్‌సీ సబ్ సెంటర్స్, అంగన్‌వాడి కేంద్రాలలో ప్రతి గురువారం, శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఆరు నెలల నుంచి 18 సంవత్సరాలలోపు జన్యులోపాలున్న పిల్లలను గుర్తించి వారిని గుంటూరులోని డీఐఈసీ సెంటర్‌కు పంపించడం జరుగుతుందన్నారు. అక్కడ వైద్యులు వారికి పరీక్షించి అవసరమైన వారికి చికిత్సలు, కృత్రిమ అవయవాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, సీహెచ్ఓ శివనాగేశ్వరి, అంగన్వాడీ సూపర్ వైజర్ మాణిక్యం, హెల్త్ సూపర్‌వైజర్ బేబీ రాణి, పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు : 75 తాళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆదిత్య స్థానిక గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులకు వైద్య పరీక్షల నిర్వహించి, ఆరోగ్య వివరాలను పొందుపరుస్తున్నట్లు చెప్పారు. ఎంఈఓ -2 సత్యనారాయణ, సర్పంచ్ భూతం నరసయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రోసూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలకలు, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు శనివారం నుంచి ఆరోగ్య పరీక్షలు చేపట్టి రాష్ట్రీ బాలస్వాస్థ్య కార్యక్రమం ప్రారంభించారు. క్రోసూరు ఎంపీపీ పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధనుష్ , ఏఎన్ఎంలు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సర్వే చేపట్టినట్లు తెలిపారు.



చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



బ్రోచర్లు ఆవిష్కరించిన వైద్యులు, సిబ్బంది

బెల్లంకొండ: ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలతో చిన్నారుల అనారోగ్య సమస్యలను గుర్తించవచ్చని చండ్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్య అధికారి డాక్టర్ కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చండ్రాజుపాలెంలోని పాఠశాలలో 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ హంసుదొర్, సూపర్‌వైజర్ బాషా, పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరావతి: స్థానిక బిఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం అత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఎంపీపీ మేకల హను మంతరావు మాట్లాడుతూ బాలికలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివ రత్నకుమార్, ఎంపీడీఓ పార్వతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దు



సత్తెనపల్లి: హెచ్‌ఐవీ అంటు వ్యాధి కాదని, హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష, చిన్న చూపు లేకుండా సమాజంలో కలిసి జీవించేలా తోడ్పడాలని హ్యాపెన్ టీం సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ గుజ్జర్లపూడి జయరాజు సూచించారు. పట్టణంలోని ఎస్‌బీజీ, వేద నర్సింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ హెచ్‌ఐవీ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు హ్యాపెన్ టీం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్‌ఐవీ పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జయరాజు హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ వ్యాధి సోకినట్లయితే తీసుకోవాలసిన చికిత్స గురించి అవగాహన కల్పించారు. హెచ్‌ఐవి యాక్ట్–2017, ఏఆర్టీ మందులు వాడకం, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలియజేశారు. కళాశాలల ప్రిన్సిపాల్ మాధవి, శ్రీనివాస్ రెడ్డి, చింతాడ రమేష్, ఏఎన్ఎం సీహెచ్ అమ్మాజీ, ఓఆర్ డబ్ల్యూటీ నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధికి కృషి



నకరికల్లు: సహకార రంగం భవిష్యత్‌లో మరింత బలోపేతంగా వ్యవస్థీకృతమై నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తుందని సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి అన్నారు. అఖిలభారత 71వ సహకార వారోత్సవాలను నకరికల్లులోని సొసైటీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో సహకార పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, కోల్డ్ స్టోరేజీలు, మల్టీ ఫెసిలిటీ సెంటర్‌లు కేటాయించి, పరపతేతర వ్యాపారం నిర్వహించబడుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సీఈఓ ప్రసాద్ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించి సహకార సుత్రాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఇన్‌చార్జి పర్సన్ మహేష్, ఉద్యోగులు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బిషప్ సత్యకిరణ్‌కు సేవా రత్న అవార్డు



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్ సేవలను గుర్తించి హైదరాబాదులో శుక్రవారం భారతీయ స్ఫూర్తి సేవా రత్న నేషనల్ అవార్డును ప్రదానం చేశారు. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో అవార్డును అందజేశారు. బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్ మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏషియన్ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్నతికి విద్య తప్పనిసరి

సత్తెనపల్లి: ఆడపిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య తప్పనిసరి అని హెచ్ఎం ఉమాదేవి అన్నారు. కంటిపూడి గ్రామ ఎంపీపీ పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీబీఆర్సీ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే.. శిక్షార్హులన్నారు. ఉపాధ్యాయులు సరోజ, విద్యార్థులు పాల్గొన్నారు. కంటిపూడి యానాది కాలనీలో కత్తి ఏసుబాబు, తిరుపతమ్మ నివాసం ఉంటున్న పూరి గుడిసె కరెంటు షాక్ తగిలి గుడిసె కాలిపోయింది. డీబీఆర్సీ డైరెక్టర్ దేవకుమార్ సహకారంతో టార్పాలిన్ పట్టా, రైసు, నిత్యవసర సరుకులు అందించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



క్రోసూరు: నాగవరం గ్రామ ఎంపీపీ బీసీ పాఠశాల ఉపాధ్యాయుడు, ఎస్టీయుూ జిల్లా కార్యవర్గ సభ్యుడు కూరాకుల శ్రీనివాసరావు(57) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిగా శ్రీనివాసరావు సురపరిచితుడు. ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, గణేష్, ఉపాధ్యాయులు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

గ్రంథాలయాల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



సత్తెనపల్లి గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు



క్రోసూరులో గ్రంథాలయ వారోత్సవాల ర్యాలీ

సత్తెనపల్లి: గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలను గ్రంథాలయాధికారులు నిర్వహించారు. ముఖ్యఅతిథులు విద్యార్థులకు గ్రంథాలయ ప్రాధాన్యత, ఉపయోగాలను వారికి వివరించారు. విజ్ఞానంతో పాటు సామాజిక చైతన్యానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహద పడతాయని చెప్పారు. సత్తెనపల్లి పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రపటాల ఆవిష్కరణ, స్మరణ కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకుడు ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు.

పెదకూరపాడు: ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చేసిన కృషి మరువలేనిదని ప్రజా కవి దర్శి శేషారావు అన్నారు. పెదకూరపాడులోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల చరిత్రపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ ఉద్యమ యోధులు నూరు వెంకటరమణ, పాతూరి నాగభూషణం, అబ్బూరు రామకృష్ణ, అడుసుమల్లి శ్రీనివాసరావు తదితర ఉద్యమకారులను స్మరించుకున్నారు. చిన్నారులు గీసిన స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాలు ఆకట్టుకున్నాయి. గ్రంథాలయ శాఖ అధికారి కొరప్రాటి వాని, ఎస్టీయుూ సంఘ నేత నయంతులా పాల్గొన్నారు.

క్రోసూరు: స్థానిక గ్రంథాలయంలో అధికారి వై.వీరాంజమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు జి.పద్మావతి, ఎంపిటీసీ సభ్యురాలు షేక్ హుస్సేన్ బీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని నినాదాలు చేశారు. గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల పురుషోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళులర్పించారు. చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు.



గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి నివాళి



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజుపాలెం: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలను తహసీల్దారు దుర్గేషరావు ప్రారంభించారు. నవోదయ, ఎస్ఎఫ్ఎస్, రాజుపాలెం జెడ్పీ, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయ అధికారి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఉపాధ్యాయులు డి.ప్రసాద్, బి.జ్యోతి, ఎస్ బాబు, బి.అనసూయ, వై.రాధాకృష్ణ పాల్గొన్నారు.

అమరావతి: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తొలుత అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ మేకల హనుమంతరావు, చేకూరి జాజి బాబు, గ్రంథాలయాధికారి వెంకాయమ్మ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేతకు మొండి చేయి

సత్తెనపల్లి: చేనేత కార్మికులను ఆదుకుంటానని చెప్పి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో మొండి చేయి చూపిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, జిల్లా కార్యదర్శి అనుమల వీరబ్రహ్మం శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఒక రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గతంలో అధికారంలో ఉన్నప్పుడు హైటెక్ యుగంలో గుంత, మగ్గం అక్కర్లేదని మాట్లాడటం జరిగిందన్నారు. అంటే పవర్ లూమ్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇప్పుడు అలా మాట్లాడకుండా చేనేతను పూర్తిగా ధ్వంసం చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆరోపించారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి



క్రోసూరు: మద్యం షాపుల్లో మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టి.తులసి నిర్వాహకులను హెచ్చరించారు. శనివారం సీఐ, సిబ్బంది ఎక్సైజ్ పరిధిలోని లైసెన్సులు పొందిన 10 మద్యం షాపులను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మద్యం షాపు ఎదుట ధరల పట్టిక పెట్టించామన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే 83092 25378 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి 10 బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు, ఏడు తెలంగాణ మద్యం కేసులు పెట్టినట్లు చెప్పారు. అచ్చంపేట మండలంలో వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల మార్పుపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ ఎం.భవాని శంకర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గతంలో ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రం తొలగించి, మరో గదిలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఇప్పటి వరకు ఎమ్మెల్సీ ఓటు పొందేందుకు అందిన అర్జీల పరిశీలన ప్రక్రియ పూర్తికావచ్చిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఎం నాయకులు రామలింగారెడ్డి, నాగేశ్వరరావు, అమరలింగేశ్వరరావు పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధి

ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ మీరయ్య

పెదకూరపాడు: అధికారులు సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన అంశాలను ప్రణాళిక బద్ధంగా నెరవేర్చాలని ఎంపీపీ కోరారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను గ్రామ తీర్మానాలకు లోబడి చేపట్టాలని కోరారు. ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు నివారించేందుకు ప్రజా ప్రతినిధులు సహకారం కావాలని కోరారు. రాబోయే ఆరు నెలలకు సంబంధించి బడ్జెట్‌పై చర్చించారు. ఎంపీడీవో రామకృష్ణ, తాసిల్దార్ దానియేలు పాల్గొన్నారు.

ఇంత కమ్యూనికేషన్ గ్యాప్ పనికి రాదు..!



రోడ్డు మార్జిన్‌లో తీసిన గుంత

అచ్చంపేట: ఒక ప్రముఖ కంపెనీ తమ టెలీ కమ్యూనికేషన్ సర్వీసులను విస్తరించడంలో భాగంగా రోడ్డు మార్జిన్లలో గుంతలు తీశారు. పని పూర్తయినా పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. అమరావతి రోడ్డులోని ఊటుకూరు, రుద్రవారం, ఓర్వకల్లు, కోగంటివారిపాలెం, చిగురుపాడు గ్రామాలను కలుపుతూ అచ్చంపేట వరకు పైపు లైన్ కోసం మూడు నెలల క్రితం అక్కడక్కడ సుమారు 6 అడుగుల పొడవు, నాలుగు అడుగుల లోతుతో గుంతలు తీశారు. పని పూర్తయ్యి నెలరోజులు కావస్తోంది. అయినా గుంతలు పూడ్చకుండా అలానే వదిలేశారు. కంపెనీ ప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలు ఎదురొస్తే పక్కకు వెళ్లాలన్నా కష్టంగా ఉందని చెబుతున్నారు. గేదెలు గుంతల్లో పడిపోతున్నాయని, పొలాల నుంచి పత్తి మూటలతో రావాలన్నా తీవ్ర ఇబ్బందులను పడుతున్నామని చెబుతున్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



దుప్పట్లు, నోటు పుస్తకాల పంపిణీ చేస్తున్న అధికారులు

రాజుపాలెం: కొండమోడు పరిధిలోని వీరమ్మ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు దుర్గేష్‌రావు, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ శంకరరావు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనాథ పిల్లలకు, వృద్ధులకు దుప్పట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న గరికపాటి శంకరరావును అభినందించారు. ఎంఈవో మల్లికార్జునశర్మ, ఐసీడీసీ సూపర్‌వైజర్ స్వర్ణలత, పరిపాలనాధికారి బసవకుమారి, టీఎస్ఆర్ కాలేజీ డైరెక్టర్ కోనేటి నరసింహారావు, ప్రసన్న పాల్గొన్నారు.

ముగిసిన రెండవ విడత శిక్షణ




ప్రజా ప్రతినిధులు, అధికారులు

సత్తెనపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్వహించిన రెండవ విడత శిక్షణ శనివారం ముగిసింది. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించాలన్నారు. ఈఓఆర్డీ ఎ.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు రెహమాన్, అంకమ్మరావు, ప్రదీప్ అంశాల వారీగా శిక్షణ ఇచ్చారు. 12 గ్రామపంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, డిజిటల్ అసిస్టెంట్స్, వెలుగు వీవోలు ఉన్నారు.

ప్రజా ప్రతినిధులకు గౌరవమివ్వాలి

ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

రాజుపాలెం: ప్రభుత్వాలు మారుతూ ఉంటాయని, అధికారులు మాత్రం బాధ్యత గుర్తెరిగి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులందరిని ఆహ్వానించాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులందరిని గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులందరూ అధికారులకు సమానమన్నారు. ముందుగా మండల స్థాయి అధికారులు వారి శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. నివేదికలు అందించారు. తహసీల్దారు దుర్గేష్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకుమార్ ఈవోపీఆర్డీ ముక్కంటి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

సత్తెనపల్లి: దళిత కౌలు రైతు పత్తి పంట పొలాన్ని రోటోవేటర్‌తో దున్నిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. శనివారం డీఎస్పీ ఎం.హనుమంతరావు సమాచారం మేరకు..అమరావతి మండలంలోని ఉంగుటూరు గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు దార్ల వీరబాబు తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన రైతుల వద్ద 2.20 ఎకరాల భూమిలో ఐదు నెలల నుంచి పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉంగుటూరు గ్రామానికి చెందిన పెంట్యాల శేషగిరిరావు కోతకు వచ్చిన పైరును దున్నేశాడు. వివాదాల కారణంగా కౌలు రైతు దార్ల వీరబాబు సాగు చేసుకుంటున్న పంటను దౌర్జన్యంగా దున్నడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి, శేషగిరిరావును అదుపులోకి తీసుకుని రిమాండుకు పంపినట్లు తెలిపారు.

నష్టపోయిన వరి పంట పరిశీలన



బెల్లకొండ: నాగిరెడ్డిపాలెంలో బెల్లంకొండ, యర్రపాలెం మేజర్ కాలువకు గండిపడి నష్టపోయిన వరి పొలాలను శనివారం వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించారు. వరి కోతకు వచ్చే సమయంలో గండి పడడంతో అధిక నష్టం వాటిల్లిందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దారు అఫ్రిసున్నిసా బేగం, ఏఓ కృష్ణయ్య దాదాపు 14.61 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. పంట నష్టం అంచనా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. రైతులకునష్ట నివారణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకయ్య సిబ్బంది అయ్యప్ప, మండల టీడీపీ వెన్నా సీతారామిరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.